క్లుప్తంగా

కొఠారును కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



కొఠారు రామచంద్రరావును కలిసిన గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నేతలు

దెందులూరు: ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మంగళవారం ఆయన నివాసంలో గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. గాలాయగూడెం గ్రామ శివారు ప్రాంతాల్లో పోలింగ్ సరళిని రామచంద్రరావుకు వివరించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రణాళిక, సమన్వయంతో పార్టీకి కృషి చేసినందుకు కొఠారు రామచంద్రరావు నాయకులను అభినందించారు. గాలాయగూడెం సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, నాయకులు బోయపాటి గణేష్, మునునూరి శివ, ఇరుకులపాటి సాంబ శివరావు, పెద్దిశెట్టి బసవయ్య, గంటా సుబ్బారావు, తోట వెంకన్న, శ్రీధర్, రాజీవ్ ఉన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఉచితంగా రక్తదానం

దెందులూరు: ఆపదలో, వివిధ కారణాల వల్ల రక్తం అవసరమైన వారు ఉచిత రక్తదాన గ్రూపు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఉత్తమ రక్త సరఫరా సహాయకులు అవార్డు గ్రహీత ఎన్‌జీవో సొంగా రవీంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం గంగన్నగూడెంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ఏ ప్రాంతం వారైనా, ఏ గ్రూపు రక్తం కావాల్సినా తమ ఉచిత రక్తదాన గ్రూపు సేవలను వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441390810 నంబర్‌కు సంప్రదించాలన్నారు. లేదా వాట్సాప్‌లోని ఉచిత రక్తదాన గ్రూపులో చేరి సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ గ్రూపు ద్వారా ప్రాంతాలకు అతీతంగా అవసరమైన రక్తాన్ని సకాలంలో అందజేస్తామని రవీంద్రప్రసాద్ వివరించారు.

'బాణసంచా కాల్చరాదు'

దెందులూరు: ఏలూరు రేంజ్ ఐజీ, ఎస్పీ ఆదేశాల మేరకు వచ్చే నెల 4వ తేదీ వరకు బాణసంచా కాల్చడం, విక్రయించడం, నిల్వ ఉంచడం నిషిద్ధమని పెదవేగి సీఐ కే.శ్రీనివాస కుమార్ అన్నారు. మంగళవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల ప్రజలు వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బాణసంచా విక్రయం, కొనుగో లు చేయరాదన్నారు. పెట్రోలు బంకుల నిర్వాహకు లు కంటైనర్లు, బాటిళ్లల్లో పెట్రోలు, డీజిల్ పోయవద్దని, వాహనాల్లో మాత్రమే ఇంధనం నింపాలన్నా రు. ఎవరైనా ఈనిబంధనలు పాటించకపోతే పెట్రో లు బంకు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని బంకులపై నిఘా ఉంచామని గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలందరూ, రాజకీయపార్టీల నాయకులు పోలీ సు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆయన వెంట దెందులూరు ఎస్సై కె.స్వామి ఉన్నారు.

● **జంగారెడ్డిగూడెం రూరల్:** కౌంటింగ్ అనంతరం గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవాల ర్యాలీలలో బాణాసంచా వినియోగించరాదని జంగారెడ్డిగూడెం సీఐ బి.రాజేష్ చెప్పారు. మండలంలోని వేగవరం, పంగిడిగూడెం గ్రామాల్లో ఆయన ఈమేరకు సదస్సులు నిర్వహించి పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏదైనా సమస్యలు నెలకొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ప్రతి కుటుంబానికీ పని కల్పించాలి



గుడివాకలంకలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాము

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు పని కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడుతోందని ఏలూరు జిల్లా డ్వామా పీడీ ఎ.రాము అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని అడిగిన ప్రతి కుటుంబానికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. గ్రామ సభల్లో ప్రజలు సూచించిన పనులన్నీ కూలీలతో చేపట్టాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా పనులు చేయడం వల్ల కూలీలకు చేతినిండా పని ఉంటుందన్నారు. కూలీలు చేసిన పని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధికి నిధులు వెచ్చిస్తుందని తెలిపారు. ఆయన కూలీలతో మాట్లాడారు. పని దినాలు, వేతనాలు, మస్తర్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీఓ కిషోర్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రాలను తెరవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): కొబ్బరి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కొబ్బ రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. కొబ్బరి కాయలకు కనీస ధరలు రాక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెయ్యి కొబ్బరి కాయలకు రూ.8 వేలు మాత్రమే ధర వస్తుందన్నారు. వెయ్యి కాయలు కోసి గుట్టగా వేయడానికే రూ.3 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. పంట సాగుకు రైతు పెట్టిన పెట్టుబడి రావడం లేదని అన్నారు. తెగుళ్ల వల్ల దిగుబడులు బాగా తగ్గిపోయాయని తెలిపారు. మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు బాగా తగ్గాయని, విదేశీ కొబ్బరి ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు కావడంతో దేశీయంగా మార్కెట్లో కొబ్బరి ధరలు పడిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొబ్బరి అత్యధికంగా సాగు చేసే కోనసీమ, ఉద్దానం, పశ్చిమగోదావరి, ఏలూరు, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ తదితర ప్రాంతాల రైతులు నష్టాల పాలై ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో వెంటనే నాఫెడ్ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, కనీస ధర రైతుకు వెయ్యి కాయలకు రూ.15 వేలు ఇవ్వాలని, రైతుల నుంచి నేరుగా కొబ్బరి కాయలని సేకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మిల్లింగ్ కొబ్బరి క్వింటాల్‌కు రూ.11,160, బంతి కొబ్బరి క్వింటాల్‌కు రూ.12 వేలు రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కాదని చెప్పారు. కొబ్బరి రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

పెదపాడు: ఈనెల 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

సారా విక్రేత అరెస్ట్

టి.నరసాపురం: నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై దుర్గా మహేశ్వర రావు తెలిపారు. మండలంలోని గండిగూడెం గ్రామంలో సిబ్బందితో కలిసి మంగళవారం ఎస్సై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన సాయిల వెంకటరమణ సారా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని చింతలపూడి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక రాజుల కాలనీలో బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి చక్కెర పొంగలి, పులిహోర, రెండు రకాల కూరలు, ఒక చట్నీ, సాంబారు, పెరుగు, అన్న ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. 1500 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ అన్నదాన కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు తెలిపారు. దాతలుగా ముత్తా గంటా రావు, సోరపల్లి శివ సత్య సాయిబాబు వ్యవహరించినట్లు చెప్పారు.

బాధితులకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి పరామర్శ

దెందులూరు: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ఆశ్రం వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతున్న వారిని ఎంఆర్‌పీఎస్ నాయకులు కంకిపాటి నాగరాజు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, డాక్టర్ లింగయ్య, ముల్పూరి రాంబాబు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్యసేవల వివరాలను బంధువులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన అవసరం



విజేతలకు మోపెడ్ తాళం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైతులంతా ఎరువుల యాజమాన్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ రీజనల్ బిజినెస్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి సూచించారు. స్థానిక శ్రీ రామాంజనేయ మెన్యూర్స్ దుకాణంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎంకేఎస్‌కే ద్వారా మట్టి నమూనా పరీక్షలు చేస్తామన్నారు. గత రబీ సీజన్‌లానే ఖరీఫ్ సీజన్‌లో కూడా గ్రోమోర్ రైతు సంబరాల పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రోమోర్ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు ఆరు టీవీఎస్ మోపెడ్‌లను బహూకరించారు. కార్యక్రమంలో కోరమండల్ డీజీఎం ఎం సచ్చిదానంద రెడ్డి, నానో డీఏపీ బిజినెస్ మేనేజర్ స్వరూప్, సీనియర్ అగ్రోనమిస్ట్ పి.సూర్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ కె.రమేష్, అగ్రోనమిస్ట్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతి భద్రతలకు సహకరించాలి



అడవికొలనులోని దుకాణాల వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై ఆర్ శ్రీను, సిబ్బంది

నిడమర్రు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు గ్రామ పెద్దలు సహకరించాలని నిడమర్రు ఎస్సై ఆర్. శ్రీను కోరారు. మంగళవారం అడవికొలనులో అన్ని పార్టీల శ్రేణులకు, గ్రామ పెద్దలతో సమావేశం సీఐ సుభాష్ ఆధ్వర్యంలో నిడమర్రు పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ కోడ్ అమలులో ఉంటుందన్నారు. అంత వరకూ గ్రామాల్లో పార్టీల జయాపజయాలపై ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ఇరుపార్టీల నాయకులు కృషి చె య్యాలన్నారు. ఎన్నికల కారణంగా గ్రామాల్లోని సంప్రదాయాలకు ఎటువంటి భంగం కలగకుండా అందరూ కలిసి మెలిసి ఉండేలా కృషి చెయ్యాలన్నారు. ఏదైనా చిన్న సమస్యలు వచ్చిన తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై కోరారు. అనంతరం గ్రామంలోని దుకాణాల యజమానుల వివరాలు సేకరించి వారిని అప్రమత్తం చేసారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు పోలీసులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. పొలానికి రక్ష

- భూమిలో ఉన్న పోషక లోపాల నిర్ధారణ
- ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గుదల
- రైతులకు వ్యవసాయ ఖర్చు ఆదా

పెదపాడు: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు లోపాలు తెలుసుకని వాటికి అనుగుణంగా ఆ పంటల సాగుకు అవసరమైన ఎరువుల వినియోగానికి భూసారు పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంతమంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలోని పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడు బారడంతో పాటు చీడపీటల ఉధృతి, వాతావరణ కాలుష్యం, వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. భూసార పరీక్షలతో పాటు చీడపీడల ఉధృతి వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దెందులూరు నియోజకవర్గంలో 43,531 ఎకరాల వ్యవసాయ భూమి సాగులో ఉంది. దీంతో పాటు వివిధ రకాల తోటలు 9,375 ఎకరాల భూమి సాగులో ఉంది. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయ లక్షణాలు 52,906 ఎకరాల్లో తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు.



భూసార పరీక్షల కోసం పొలంలో మట్టి సేకరిస్తున్న దృశ్యం

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పంట కోత పూర్తయిన తరువాత వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు తీయాలి పొలాలలకు సాగు నీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించకూడదు.
- పొలాల్లో నీడ పడే ప్రదేశాలు చేల గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు.

ముందుగా నేలపై ఉన్న గడ్డి చెత్త కలుపు మొక్కలు తీసేయాలి.

- వరిపొలంలో వి ఆకారంలో 15-20 సెంటీ మీటర్ల లోతున పారతో గుంత తీసి పై పొర నుండి కింది వరకు ఒక్క పక్కగా మట్టిని సేకరించాలి.
- వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు 8 ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అర కేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి.
- మట్టి నమూనా బాగా ఆరిన తరువాత పాలథిన్ కవర్‌లో నింపి రైతుల వివరాలు సర్వే నంబరు, విస్తీర్ణం గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్షా కేంద్రాలకు పంపాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగులాల లోతు నుంచి మట్టి నమూనా సేకరించాలి.
- పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక రసాయనక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత (ఎలక్ట్రికల్ కండక్టవిటీ) నేల ఆమ్లక్షార గుణాలు, ఆ నేలలో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్ష కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో మేలు



భూ సార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంలో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే అవకాశముంది. భూసార పరీక్షల్లో పెదపాడు పెదవేగి దెందులూరు ఏలూరు మండలాల్లో భాస్వరం అధికంగా ఉన్నట్లు, పొటాషియం మధ్యస్తంగా, యూరియా శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీనికి అనుగుణంగా రైతులకు సలహాలు అందిస్తాం. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

– వై సుబ్బారావు, అసిస్టెంట్ డైరక్టరు వ్యవసాయ శాఖ ఏలూరు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



ఇంగ్లీష్ గ్రామర్‌ను విద్యార్థులకు వివరిస్తున్న తుమ్మల ఉమామహేశ్వరరావు

భీమడోలు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో చిన్నారులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేసి పుస్తక సమీక్షలు రాసారు. లెక్కలు సబ్జెక్టుల్లో మెళకువలు, ఇంగ్లీషు గ్రామర్ వంటి అంశాలపై శిక్షణ అందించారు. తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వేసవి సెలవులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూళ్లలో రిటైర్డ్ టీచర్ బి.పరశురాముడు చిన్నారులు లెక్కల సబ్జెక్టులో మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలిస్తున్న ఆర్ఓ

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గ ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను ఐటీడీఏ పీఓ, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ పరిశీలించారు. ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలకు ప్రభుత్వం మూడంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపుల తాళాలు, సీల్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాలను కూడా పరిశీలించారు. కేంద్ర, పోలీస్ బలగాల గార్డ్‌ను, జిల్లా ఆర్డ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తులను కూడా పీఓ పరిశీలించారు. ఇక్కడ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ప్రాంతాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అన్నారు. నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈవీఎం కంట్రోల్ రూమ్‌ను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	00

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

ఇరుకు వంతెనలపై ప్రయాణికుల ఇక్కట్లు



బ్రిటీష్‌కాలం నాటి నారాయణపురం వంతెన



నారాయణపురం వంతెన వద్ద నిలిచిన ట్రాఫిక్ (ఫైల్)

ఉంగుటూరు: ఇరుకు వంతెనలపై ప్రయాణానికి వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి వంతెనలతో గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి ఏలూరు కాలువ నియోజకవర్గంలోని చాలా గ్రామాలను మధ్యగా చీలుస్తూ ప్రవహిస్తుంది. తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వరకు ఉన్న గ్రామాల్లో ఏలూరు కాలువపై వంతెనలు బ్రిటిష్ కాలంలోనే నిర్మించారు. వాటిని నిర్మించి 7 దశాబ్దాలపైనే అవడంతో వంతెలు శిథిలావస్థకు చేరాయి. ఉంగుటూరు వంతెన గత టీడీపీ పాలన సమయంలో కూలిపోయింది. అక్కడ గ్రామ పంచాయతీ నిర్మించిన బెయిలీ బ్రిడ్జిపై కొంతకాలం రాకపోకలు సాగాయి. ఆ సమయంలో పాత బ్రిడ్జిపైనే రూ.35 లక్షల వ్యయంతో శ్లాబ్ మాత్రమే వేసి చేతులు దులుపేసుకున్నారు. ఆ సమయంలో కొత్త బ్రిడ్జి నిర్మిస్తారని గ్రామ ప్రజలు ఆశించినా నెరవేరలేదు. ఇప్పటికీ ఆ వంతెన మీద రెండు వాహనాలు తప్పుకునే వీలు లేక తరుచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. జాతీయ రహదారిపై టోలు ప్లాజా ఏర్పాటుతో అక్కడ రుసుము ఎగవేత కోసం గ్రామంలోని అంతర్గత రోడ్లపై నుంచి వాహనదారులు వెళుతుండటంతో వంతన వద్ద ట్రాఫిక్ మరింత పెరిగి సమస్య మరింత జఠిలమవుతోంది. భీమవరం -జంగారెడ్డిగూడెం వెళ్లే వాహనాల వల్ల నారాయణపురం వంతెన వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్య తీర్చలేక పోలీసులు సైతం తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి పూళ్ల గుండుగొలనులోనూ నెలకొంది. ఈ రెండు ప్రాంతాల్లో నూతన బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.